క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విప్రోజీ హెల్త్ కేర్ సర్వీస్ ఇంజినీర్ ఒమ్మి రవికిరణ్ ఆధ్వర్యంలో జీజే హాస్పిటల్ వైద్య సిబ్బంది ఎముకల సాంద్రత పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన ఎముకల సాంద్రత పరీక్ష చేయించుకున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివాజీ ప్రసాద్, మొల్లి ఉదయ్‌భాస్కర్, అరుణ్ కుమార్, సారిపిల్లి రాజు, ఒమ్మి ఆనంద్, ఒమ్మి కృష్ణారావు, సారిపిల్లి సంతోష్, అరుణ్, కిషోర్, భాస్కర్, రామకృష్ణ, మహేష్, అభిషేక్, వాసు, షణ్ముక్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక ముఖద్వారం ప్రారంభం నేడు



వాకర్స్ క్లబ్ నూతన ముఖద్వారం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో నూతనంగా నిర్మించిన అత్యాధునిక ముఖద్వారం సోమవారం ప్రారంభిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. రూ.5 లక్షలతో నిర్మించిన ఈ ముఖద్వారానికి అవసరమైన నిధులను శ్రీచక్ర వెంచర్స్ అధినేత గద్దె చక్రధర్ సమకూర్చినట్లు చెప్పారు. వాకర్స్ సమక్షంలో దీన్ని విరాళాల దాత గద్దె చక్రధర్ ప్రారంభిస్తారని, వాకర్స్ అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



నృత్యం చేస్తున్న కళాకారులు వైదా వేద్య, ప్రహర్షిత

బీచ్ రోడ్డు: సాగరతీరంలోని అన్నమయ్య వేదిక వద్ద ఆదివారం తారకేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఎస్ఎస్‌వీ సత్యభామ శిష్యులు వైదా వేద్య, ప్రహర్షిత తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం శాస్త్రీయ నృత్య పోషక్ ఉపాహారం అవార్డులతో నృత్యకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు ఇంద్ర మోహన్, స్వామి జ్ఞాన ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. సరస్వతీ నిలయాలు

అల్లిపురం: గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని, వాటిని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అల్లిపురం శాఖా గ్రంథాలయ అధికారి పీవీఎస్ రాజు అన్నారు. ఆదివారం గ్రంథాలయాన్ని పాఠకులు, సిబ్బందితో కలసి మనం-మన గ్రంథాలయం కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు. పుస్తకాలను కేటగిరీల వారీగా సర్దిపెట్టారు. ర్యాకులపై, పుస్తకాలపై పేరుకుపోయిన దుమ్మును శుభ్రపరిచారు. గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న చిల్డ్రన్ క్లబ్‌లో భాగంగా చిన్నారులు గ్రంథాలయానికి చేరుకుని వారికి కావాల్సిన పుస్తకాలను తీసుకుని చక్కగా చదువుకున్నారు.

పచ్చదనానికి తూట్లు

- ఇష్టానుసారంగా గ్రీన్‌బెల్ట్‌ల ఆక్రమణ
- వ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- దృష్టి సారించని అధికారులు



ధర్మానగర్ గ్రీన్‌బెల్ట్‌లో ఉంచిన ఇనుప సామగ్రి

కంచరపాలెం: స్వప్రయోజనాల కోసం కొందరు పచ్చదనానికి తూట్లు పొడుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించే గ్రీన్‌బెల్ట్‌లను ఇష్టానుసారంగా ఆక్రమించేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. కంచరపాలెం, తాటిచెట్లపాలెం కూడలి నుంచి ఆర్ అండ్ బీ బిర్లా జంక్షన్ వరకు జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేశారు. దీనిలో మొక్కలు పెంచాల్సి ఉన్నా.. అవి నాటిన జాడే కనిపించడం లేదు. గతంలో జీవీఎంసీ కమిషనర్లు కోట్ల రూపాయలు వెచ్చించి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ గ్రీన్‌బెల్ట్‌లో కొంత మంది వ్యాపారులు పాగా వేసి తమ అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఫలితంగా పచ్చదనం కనుమరుగవుతోంది. అదే విధంగా జీవీఎంసీ లక్ష్యం కూడా నీరుగారుతోంది.

ఇదీ పరిస్థితి..

- కంచరపాలెం, ఊర్వశి కూడలి, తాటిచెట్లపాలెం, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, శ్రీనగర్ ప్రాంతాల పరిధిలోని గ్రీన్‌బెల్ట్.. ఆటోలు, కార్లు, మరమ్మతుల వాహనాలతో నిండిపోయింది. ఏళ్ల తరబడి వాటిని తొలగించకపోవడంతో తుప్పుపట్టి రోడ్లపైనే అడ్డంగా పార్క్‌చేసి వదిలేశారు.
- రవీంద్రనగర్, దుర్గానగర్, రెడ్డి కంచరపాలెం, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ దేవేంద్రనగర్ ప్రాంతాల గ్రీన్‌బెల్ట్ స్థలంలో ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్‌లను సైతం తొలగించి వారికి అనుగుణంగా మార్చుకున్నారు.
- కంచరపాలెం కూడలిలో గ్రీన్‌బెల్ట్‌ను తొలగించి చేపలు, మాంసం విక్రయిస్తున్నారు. చెత్తాచెదారాన్ని సక్రమంగా తొలగించకపోవడంతో గ్రీన్‌బెల్ట్ దుర్గంధభరితంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.
- కంచరపాలెం సన్‌రైజ్ క్లబ్, షిర్డీసాయి ధ్యాన మందిరం పక్కన గ్రీన్‌బెల్ట్‌లో వ్యాపారులు కొంతమంది ఇసుక, పిక్క, ఇటుకలు నిల్వ చేసి వ్యాపారాలు చేస్తున్నారు. వాటి ఎగుమతులు, దిగుమతుల సమయంలో జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్ సబ్‌వేను ఆక్రమిస్తున్నారు.



కంచరపాలెం-శ్రీనగర్ గ్రీన్‌బెల్ట్‌లో కార్ల పార్కింగ్

- బిర్లా, కప్పరాడ జంక్షన్ ప్రాంతాల్లో బస్టాప్‌ల పక్కన బడ్డీలు, ఇతర తోపుడు బండ్ల దుకాణాలు వెలిశాయి.
- ఇండస్ట్రియల్ ప్రాంతంలో గ్రీన్‌బెల్ట్‌ను పూర్తిగా తొలగించి కార్ల షోరూమ్‌కు చెందిన వాహనాలను పార్క్ చేస్తున్నారు.
- జోగారావు నగర్, ధర్మా నగర్, గంగన్న నగర్ ప్రాంతాల గ్రీన్‌బెల్ట్ వెనకాల ఎక్కువగా తుక్కు, పాత సామగ్రి దుకాణాలు నిర్వహిస్తున్నారు. వాటికి వచ్చే చెత్తాచెదారాన్ని పెద్ద మూటలుగా కట్టి గ్రీన్‌బెల్ట్‌లో నిల్వ చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.
- ప్రభుత్వ స్థలంలో పచ్చదనాన్ని రూపు మాపి కొంత మంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ రహదారి పక్కన రూ.కోట్లు ఖర్చు పెట్టి గ్రీన్‌బెల్ట్‌లు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం అక్కడ పచ్చదనం కనిపించడం లేదు. జోన్-5 అధికారులు దృష్టి సారించి గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



14వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఏఎస్సార్ నగర్ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఆయన కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ వార్డులో రూ.37,83,000తో బీటీ రోడ్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, ఏఈ శ్రీరాంమూర్తి, పలువురు పార్టీ వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



నిత్యావసర సరకులు అందిస్తున్న గొర్లె చందు

కంచరపాలెం: సేవ చేసేందుకు ఎల్లలు లేవని సాలగ్రామపురం పోర్ట్ స్కూల్ పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ స్కూల్‌లో చదివి అమెరికాలో స్థిరపడిన సిరాజ్ పంపిన ఆర్థిక సాయంతో విశాఖ పోర్ట్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం పాఠశాల ఆవరణలో సంఘ అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అతిథులు పోర్ట్ అండ్ డాక్ ఫెడరేషన్ కార్యదర్శి గొర్లె చందు, ట్రస్టీ ఆర్.రమణబాబు, సేవ్ స్కూల్ కమిటీ చైర్మన్ తుమ్మల త్రినాథ్, ఐటీసీ మేనేజర్ వసుంధర మాట్లాడుతూ అసోసియేషన్ తరఫున సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని కొనియాడారు. సిరాజ్ స్ఫూర్తితో, ఇతర పూర్వ విద్యార్థుల విరాళాలతో సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆటో మరమ్మతుల కోసం బాష అనే పూర్వ విద్యార్థికి రూ.50 వేలు చెక్కును, మరో ముగ్గురు విద్యార్థులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదును అందజేశారు. వివిధ కారణాల వల్ల మరణించిన 16 పూర్వ విద్యార్థుల కుటుంబాలకు రూ.2,500 విలువ చేసే నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వెంకటలక్ష్మి, అనిల్, జి.రమణమూర్తి, ఎ.వి.హరికుమార్, సభ్యులు ప్రసాద్, విక్టోరియా, పూర్వ విద్యార్థులు కనక మహాలక్ష్మి, చింతల రమణ, శివనారాయణ, సత్యనారాయణ, ప్రవీణ్, రామకృష్ణ, గోపి, రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్‌కు జ్ఞాపికను అందిస్తున్న క్లాస్‌మేట్స్

మురళీనగర్: నగరంలోని సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల 1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఆ ఏడాది పదో తరగతి చదివి రాష్ట్రంలోనే కాకుండా దేశ, విదేశాల్లో స్థిరపడిన స్నేహితులు ఓ చోట కలుసుకుని ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ సంధానకర్తగా వ్యవహరించారు. నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పాల్గొని తన స్నేహితులతో కాసేపు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య స్నేహితులను కలుసుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇలా కలుసుకోవడం వల్ల బాల్యాన్ని గుర్తు చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. స్నేహితులను ఎన్నటికీ మరిచిపోరాదన్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అందరూ ఆటపాటలతో సరదాగా సందడి చేశారు. ఆర్థోపెడిక్ డాక్టర్ రాము తన స్నేహితులకు ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో గెద్దం విజయ్, రాజశేఖర్, కోడి శ్రీనివాస్, సలీమ్, ప్రసన్నకుమార్, నామాల రవికుమార్, శాస్త్రి, యడ్ల గోవింద్, పంచముఖి, మళ్ల రమేష్, కల్యాణ్, గోపి పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా కేరళ ఉత్సవాలు



ఆకట్టుకుంటున్న క్రీస్తు జననం సెట్



గీతాలాపన చేస్తున్న కేరళ బ్యాండ్ పార్టీ

మురళీనగర్: నగరంలోని కేరళీయులందరూ క్రిస్మస్‌తోపాటు నూతన సంవత్సర వేడుకలను బిర్లా కూడలిలోని కళా సమితి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. కేరళ మలబార్ చర్చి ఫాదర్ రెవరండ్ జోఫీ చిరయాత్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం కేరళ నుంచి వచ్చిన ఆర్కెస్ట్రా క్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలుపుతూ ఏర్పాటు చేసిన అలంకరణ ఆకట్టుకుంది. నగరంలోని కేరళీయులందరూ తరలివచ్చి సందడి చేశారు. కార్యక్రమంలో కేరళ కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎం పిళ్లై, కె.హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ముగిసిన అన్నదానం



ప్రత్యేక అన్నదానంలో పాల్గొన్న మాలధారులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గతేడాది అక్టోబర్ 27న ప్రారంభించిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా వివిధ మాలల ధరించిన భక్తులకు ప్రత్యేక అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు 74 రోజులు నిరాటంకంగా ఈ కార్యక్రమం కొనసాగించామని, సుమారు 30 వేల మంది అయ్యప్ప, భవాని, శివ, సాయిబాబా, కనకమహాలక్ష్మి, వేంకటేశ్వర స్వాముల మాలధారులు అన్నప్రసాదం స్వీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు, భక్తులు, బాబా సేవకులు, ధ్యాన మందిర సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి రోజు మందిరంలో నిత్యాన్నదాన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని శేషు తెలిపారు.

వెంకటాద్రి.. ఆధ్యాత్మిక ఝరి



వెంకన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామస్మరణ మార్మోగింది. ఇక్కడ నిర్వహించిన సుదర్శన హోమం, పుష్పయాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద సుదర్శన పెరుమాళ్‌ను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై వేంజేపచేసి పుష్పయాగం వైభవంగా చేశారు. గోదాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు, 95, 96 వార్డుల కార్పొరేటర్లు ముమ్మన దేముడు, శ్రీనివాసరావు సుదర్శన హోమంలో పాల్గొన్నారు. ఈవో నీలిమ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకుడు రామనుజమ్, వైదికులు అనంతాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఉత్సాహంగా జర్నలిస్ట్‌ల క్రికెట్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జర్నలిస్ట్‌ల స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జరిగిన సెమీస్ పోటీలను బీజేపీ రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్ట్‌లకు ఆట విడుపు అవసరమన్నారు. తొలి సెమీస్‌లో కెమెరామెన్ జట్టు 31 పరుగుల తేడాతో సాక్షి జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కెమెరామెన్ జట్టు ఏడు వికెట్లకు 151 పరుగులు చేయగా.. దుర్గా, సుధీర్, నవాజ్ రెండేసి వికెట్లు తీశారు. సాక్షి జట్టు ఏడు వికెట్లే కోల్పోయినా.. 120 పరుగులకు ఇన్నింగ్స్ ముగించింది. దుర్గా 34 పరుగులు, సుధీర్ 20 పరుగులు చేశారు. కెమెరామెన్ ప్రేమ్‌కుమార్ మూడు వికెట్లు తీసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. వీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని, దానిని ఎలా ప్రయివేటుపరం చేస్తారని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు నడుపూరు గాంధీ పార్కు ఎదుట ఆదివారం ఉదయం 8 గంటలకు 24 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. వీరి దీక్షకు నడుపూరు గ్రామ ప్రజలు, కాంట్రాక్ట్ కార్మికులు, స్టీల్ కార్మికులు, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. కేంద్రం తన నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామన్నారు.

సమాచారమ్

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి



కాలువ శుభ్రతను పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లకు కాల్ చేసి తెలియజేయవచ్చు. ఉత్తర నియోజకవర్గంలోని 42వ వార్డు నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13 వార్డులకు సంబంధించి రహదారుల శుభ్రత, చెత్త సేకరణ-తొలగింపు, గెడ్డలు, కాలువల్లో పూడిక తీత మొదలగు పనుల విషయంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చు. వారు స్పందించని పక్షంలో జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు చేయవచ్చని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్‌లు తెలిపారు.

వార్డు నం.	అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
జోన్-5	డాక్టర్ రాజేష్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	99480 95520
జోన్-5	ఎస్.జనార్దన్	సూపర్‌వైజర్(పబ్లిక్ హెల్త్)	99121 99283
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	99488 83942
43	అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99665 91821
44	ఎన్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83932
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83913
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83943
50	బి.సుధాకర్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	94941 83244
51	ఎ.కృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83949
53	పి.టి.తులసీ	సచివాలయ కార్యదర్శి	99490 98777
54	వై.త్రిమూర్తులు	పబ్లిక్ హెల్త్ మేస్త్రీ	99488 83947
55	యు.కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంటు కూడలి జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆలయ ఈవో సురేషబాబు నేతృత్వంలో పూజారి ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక, ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. వంటవార్పు చేసుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మా కడుపులు కొట్టొద్దు

కంచరపాలెం మార్కెట్ మూసివేతపై వ్యాపారుల ఆందోళన



మార్కెట్ బయట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

కంచరపాలెం: దశాబ్దాల కాలంగా ఇక్కడే కూరగాయలు, చేపలు అమ్ముకుంటున్న తమపై గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం నాయకులు కక్ష కట్టి మార్కెట్‌ను ఖాళీ చేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమని వ్యాపారులు ఆదివారం ఆందోళనకు దిగారు. శనివారం అర్ధరాత్రి మార్కెట్‌కు తాళాలు వేసి వ్యాపారాలు జరగకుండా ఇసుక, మట్టి రహదారికి అడ్డంగా వేయడంతో చిరు వ్యాపారులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మీడియాతో వారు మాట్లాడుతూ ఏ సంబంధం లేని గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం సభ్యులు 70 ఏళ్లుగా అద్దెలు, కరెంటు బిల్లుల రూపంలో ఆశీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కంచరపాలెం మెట్టుపై స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా, వ్యాపారులను ఆశీల రూపంలో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో భారీ భవనాన్ని నిర్మించి తమనే తరిమేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్డీవో, కలెక్టర్‌లను ఆశ్రయించామని చెప్పారు. కోర్టులో స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు ఆపకుండా వ్యాపారాలను అడ్డుకుని తమ పొట్ట కొట్టడం అన్యాయమని వాపోయారు. ఆదివారం మార్కెట్ నిలిచిపోవడంతో ఇక్కడ వ్యాపారాలు చేస్తున్న 142 దుకాణాల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మార్కెట్‌కు తాళాలు వేయడంతో తెచ్చిన కూరగాయలు, చేపలు నష్టపోయామన్నారు. తమ స్థలంలో వ్యాపారాలు చేయనివ్వకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వ్యాపారులు కోరారు. రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న వ్యాపారులతో ఆదివారం డీసీపీ-2 ఆనందరెడ్డి, ఏసీపీ నరసింహమూర్తి, సీఐ విజయకుమార్ మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు వ్యాపారులు తెలిపారు.

వరదరాజ స్వామిగా అప్పన్న



వరదరాజ స్వామి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో వేంచేయజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన జ్యోతిరావు పూలే యునైటెడ్ ప్యానల్‌కు పూర్తి సహకారం అందిస్తామని ప్రస్తుత గుర్తింపు సంఘం, జ్యోతిరావు పూలే ఫౌండర్స్ ప్రధాన కార్యదర్శి నక్క వెంకటరమణ తెలిపారు. తమ హయాంలో ఓబీసీ ఉద్యోగుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. యాజమాన్యంపై ఒత్తిడి చేసి అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో తమపై నమ్మకం ఉంచి ఓటు వేసిన 864 మంది ఓబీసీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన యునైటెడ్ ప్యానల్ పాలకవర్గం ఓబీసీ ఉద్యోగుల కోసం మంచి కార్యక్రమాలు చేపట్టగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల కోసం చేసే కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు.